కర్నల్ బోలాంగ్ గారి వాహనము

శ్రీమతి హవాయి కావేరిబాయిగారు

భోజనము జరిగినపిమ్మట అడవిజంతువులను గూర్చిన సంభాషణ ప్రారంభమయ్యెను.

"ఒక రాత్రిపూటలో వాహారార్థమై ముప్పది, నలుపది మైళ్లుకూడ వ్యాఘ్రములు సాగింపగల" వని మాలోనొకరు చెప్పితిమి.

"ముప్పది, నలుపది మైళ్ళు సునాయాసముగానే పెద్దపులి ప్రయాణము చేయును. ఆరుగంటలకాలమునకు లోపుగానే డెబ్బది మైళ్లకు హెచ్చుగా ఒక బెబ్బులి వెళ్ళుట నేనెఱుగుదు" వని కర్నల్ బోలాంగ్ గారనిరి.

"అయితే, పులివెనుక మీరుకూడను వెళ్లియుంటిరా, యేమి?" యని మాసీనియర్ క్యాప్టెన్ (Senior Captain) ప్రశ్నించిరి.

"వెనుక వెళ్లితినా? శార్దూలముతోనే పయనను చేసితిని. చెప్పెదవినుడు." ఇట్లు కర్నల్ బోలాంగ్ గారు త్తరమిచ్చిరి.

"ఇది సంభవించినప్పుడు నేనింకను కుఱ్ఱవాడనే. హిందూదేశ మదియే రావడము. బొంబాయిలో దిగి నేను చేరవలసినదండుయుండిన X అనుయూరికి పోవుచుంటిని. అచ్చటచ్చట, విశ్రాంతినిమిత్తము, మజిలీలు చేయుటలో Z అనుచోట మిక్కిలి యాలస్యము చేసితిని. అందుచేత నచ్చటినుండి సాధారణమైన మార్గమున ప్రయాణము చేసినయెడల నేను చేరవలసినవేళకు నాగమ్యస్థాన మందుకోననని తెలిసి యడవిలో పడిపోవు యడ్డదారిలో పోదమని నిశ్చయించితిని.

నాసామానుల నదివరకే సాగనంపియుంటిని. ఇప్పుడు గుఱ్ఱము నెక్కి యడవిజొచ్చి చార్టులు కంప్యాసుల (Chart and Compass) సహాయమువలన నరుగుచుంటిని. ఒకపాతిక మైళ్ళు వెళ్ళునరికి చీకట్లు క్రమ్మెను. ఏదైన నొకచిన్నగ్రామము కనబడినచో నచ్చట విశ్రమింతుననుకొనుచుండగా హఠాత్తుగా వాయువుమీద సవారీచేసినవాడనై దగ్గరనున్న పొదలలో పిల్లిమొగ్గవేసి పడిపోతిని. నాతురగముమీద నొక ముప్పన్నెమెకమురికి దానిని క్రిందపడద్రోసి భక్షించుచుండెను.

నాకు గాయములెట్లుతప్పెనో యెఱుగను. అయినను పెద్దపులివారు విందారగించి స్వగృహమున కేగునరకు కదలక మెదలక పడియుండవలెనని నిశ్చయించితిని.

విందుముగిసెను. తనపాదములను నాసికాకేసరములమీద దుడుచుకొని యొడ్డలువిరచి పెద్దపులి యావలించెను. ఇక నీక్రూరమృగము వెడలిపోవునని తలంచితిని. అబ్బో! యది వ్రిరిదికాదు. అది నావాహనమును భక్షించుచుండిన సమయమంతయు నామీద నొకకంటిదృష్టి నిలిపియుండెను. ఇప్పుడు నాపైపునకు యడుగులు వేయుచుండెను. సరే, ముందునాగుఱ్ఱము. తరువాత నేనుకదా యనుకొంటిని.

అయితే ఆపె (అది యాడుపులియని గ్రహించితిని) యుద్దేశము వేరుగానుండెను. నాయంగీని తనదంతములతో కఱచుకొనియెత్తి నన్నువీపుమీద వేసుకొని బయలుదేరెను. గంటకు నాలుగుమైళ్లచొప్పున ప్రాకుచు వెళ్లుచుంటిమనుకొందురా? అతిశీఘ్రముగా దౌడుతీయుచుంటిమి. అడ్డమువచ్చినవానిమీదనుండి దుమికి వెళ్ళుచుంటిమి. గ్రామములుండినచో ప్రక్కకుతిరిగి వెళ్లుచుంటిమి.

అంధకారమందు క్రూరమృగముమీద స్వారిచేయుట భీతికరమైనను ముఖమల్ పాన్పులువేసి (Springs) కలిగిన మంచముమీద పరుండి ప్రయాణముచేసినట్లే, శార్దూలము వీపుమీద ప్రయాణముచేయుచుంటిని.

కొంతకాలమునకు, చంద్రోదయమగుటచేత, చుట్టుప్రక్కలనున్న వస్తువులు గోచరములయ్యెను. రెండుపర్యాయములు దాహముతీర్చుకొనుటకు నిలిచితిమి. మొదటిసారి యొకచిన్న చెరువులో నావాహనము పానము చేయుచుండగా నొకతుపాకిగుండు యామెకర్ణములనంటిపెళ్లెను. మిక్కిలి యద్భుతముగా నాపె ప్రాణముదక్కెను. ప్రచండమైన యాగ్రహముతో గర్జించుచు వచ్చుటనుండిన యొకవృక్షముదిక్కు యురికెను. ఆవృక్షముమీదనే యీవ్యాఘ్రమును నంతమొనరింపవలెనని వచ్చిన వేటకాడు కూర్చుండియుండెను.

ఇక నేను తప్పించుకొందునని యుల్లాసమొందితిని. అకటా! తత్క్షణమే శార్దూలము మరల దౌడు మొదలుపెట్టెను. రెండవసారి యొకచిన్న యేటిలో పులినీరుత్రాగుచుండగా నాఫ్లాస్కును (Flask) దీసి దానిమూతయందు కొంచెముబ్రాంది నీటిలోకలిపి పుచ్చుకొనగలిగితిని. మరువాడు X చేరువరకు నిదియే నాకాధారమయ్యెను.

మేమెంతవడిగా పోవుచుంటిమో చెప్పజాల. ఒకప్పుడు తుపానుగాలియొక్క యెదురువడితో వెళ్లుచుంటిమి. చతుష్పాదజంతువులలో నేదియైన నింతవేగముగాపోవునని నాకు తెలిసియుండలేదు.

ఒకానొకచోట మామార్గమున నొకపెద్దకొండవలె నొక మదపుటేనుగు నిలువబడియుండెను. వెన్నెల దానిమీదపడగా నెట్లువర్ణింతు దంతియొక్క ప్రభావము? ఆహా! నేనే నాపాదములమీదనిలువబడి యొక తుపాకి హస్తమునపొందినవాడనైయుండినచో పర్వతమువలె నిలచియుండుదంతి నేలమీద సాష్టాంగదండములు నాకిడునుకదా యనుకొంటిని.

మాయిరువురి వాసనతగిలినవెంటనే మేము చేరబోవుచున్న పొదలమీదికి గజమువచ్చుచుండెను. తొండమును తోకను పైకెత్తెను. మహాకోపముతో నరచుచు ఖడ్గములవలె తీవ్రముగానుండు దంతములతో భయంకరరూపముదాల్చెను.

మేమైతెనో చక్కగా స్టీం (Steam) ఎక్కించితిమి. మెఱుపుతీగను మించినది మావేగము. కారుదున్నల మందయొకటి గురకలుపెట్టుచు నిద్రించుచుండెను. ఆగురకలకు కొమ్మలమీద యాకులుకదలుచుండెను. ఈయడవిదున్నల మధ్యనుండి వెళ్లునప్పుడుమట్టుకు మావేగము కొంచెముతగ్గెను.

మరొకచోట నొకచిఱుతె యొక లేడిపిల్లను తినుచుండెను. మమ్ముమజూచి గుర్రుమనుచు పాఱిపోవుటకు ప్రయత్నించెనుగాని దానియాహారమును మేములక్ష్యపెట్టక దానిమీదనుండి దుమికివెళ్లితిమి.

మరొకస్థలమున నావాహనము కొబ్బరిచెట్టు శిఖరమంతయెత్తుపై కురికెను. దీనికి కారణము నాకు తెలియదు. అచ్చటచ్చట మ్రానులకుచుట్టుకొని గొప్పసర్పములు కనబడెను. ఏదైన నొక పెద్దయురగము మామార్గముననుండెను గాబోలు.

మరికొంతదవ్వున నొకవానరసేనకనబడెను. మమ్ములనుచూచి నలుదిక్కులకుచెదరి చెట్లలోదాగెను. శ్వేతశిరోజములు దాడియుకలిగియున్న నొక్కవృద్ధమర్కటము వెనుక నీకోతులదండు సిపాయిలవలె నలుగు రేసిగలలైను (Lines) లలో మార్చింగు (marching) చేయుచుండెను. మావలన కార్యముచెడగా నవితిట్టుచు, పళ్లనుజూపుచు, మరియు నలిపిన ఇతరకృత్యములను మీరుచూచియుండినచో కడుపుబ్బ నవ్వియుందురు.

రాత్రి దాదాపు రొండుమిదిగంటలుకొట్టినపిదప మేము బయలుదేరియుంటిమి. సుమారు రెండుగంటలు వేయువరకుకూడ మేము వెళ్ళుచుంటిమి. చివరకు వృక్షవిహీనమై రాతిబండలుగల తావుచేరితిమి. ఒక పెద్ద బిలమునుదాటి దానిగుహలోనికి తీసుకపోయి నావాహనము నన్ను క్రిందకుదించెను.

లోనికి వెన్నెల వచ్చుచుండగా నాగుండె ఝల్లుమనెను. నెత్తుటిచే తడసిన యినుకపైన రెండు పులికూనలు పరుండియుండెను. గుహాయందంతటను దుమ్ములుండెను. ద్వారమునొద్ద దట్టముగా మృదువైన

యాకలుపడియుండెను. ఏదో యొకమయూరమునుబట్టి పొట్టపిగులునట్లు దిని మాతృప్రవేశము కూడ గమనింపలేనంతటి గాఢనిద్రలో నాకూనలుండెను. పసిబిడ్డలకు మృదువైన మాంసముకావలెనని తల్లి నన్ను తాభక్షింపక పిల్లలకొరకు తెచ్చెను.

సరే గుహచేరిన పిమ్మట నన్నుక్రిందవైచి వ్యాఘ్రము ద్వారమున కడ్డముగాపరుండెను. నేను తప్పించుకొనుటెట్లు? నేను ప్రాణములతో నున్నాను అను సంగతి గ్రహించినచో నన్ను పులి వెంటనే కైలాసమునకు బంపును.

కొంతకాలమునకు మెల్లగా తెల్లవారుచుండెను. ఆజంతువులను గుహయందలి యెముకలు జూడ నాహృదయము చిందరవందరయ్యెను. పైగా మానవయంగములలోని దుమ్ములనేకములుండెను. కొన్ని గంటలలో నాశరీరము శార్దూలములకు భోజనమగునని తలచితిని.

వెలుతురు తీవ్రముగా ముదురుచుండెను. ఇంతలో నురుములను మించుగర్జనయొకటి వినవచ్చెను. దాని ప్రతిధ్వని మైలుదూరము వెళ్లెను. ఆహా! ఈవ్యాఘ్రకుటుంబమునకు యజమానుడగు మగపులియొక్క రాకడయిదియని గ్రహించితిని. గర్జనము అంతకంతకు దగ్గరగావినుచు సమీపించుచుండెను. తుదకు వెలుపల రాలియున్న యెండుటాకులమీద నడుగులచప్పుడు విశదమయ్యెను. నాకు మృత్యువు సమీపములో నేయున్న దనుకొంటిని.

అయితే, దైవము మరియొకవిధముగా నేర్పాటు చేసియుండెను. గృహస్తురాలు పురుషుని యాగమనము జూచి తొందరగాలేచి నాశరీరముపై వంతెనవలె తన శరీరమునుంచెను. తోకతో నిసుకమీద దెబ్బలువేయుచు గుర్రుమని మగనితో కలబడుటకు సిద్ధపడెను.

ఇప్పటికి పట్టపగలువలె వెలుతురాయెను. మగశార్దూలముయొక్క భీకరరూపము నాకు కనబడెను. చింతనిప్పులవంటి కండ్లతో, కోరలుపైకిచూపుచు, కోపముతోను, యాతురతతోను గుహలో ప్రవేశింపజొచ్చెను.

ఆహా! మాతృవాత్సల్యము! పసిబిడ్డలకై సంపాదించిన రుచ్యమగుపదార్థమును, వేటాడుటకు బద్ధకించి సోమరిపోతుగా తిరుగుచుండు పెనిమిటికి తల్లియిచ్చునా? ఒకక్షణములో మగనిమీదికి బాణమువలె ఛార్యపడెను. వెనుకటి కాళ్ళమీద నిలువుగా నిలువబడి వారిరువురును ఘోరయుద్ధము చేసిరి. దెబ్బలుకొట్టుకొనుట, గోళ్ళతో రక్కుకొనుట, నొకరినొకరు క్రిందపడద్రోయుటకు చూచుట, నింకననేకవిధములుగా భయంకరమగు పోరుసలిపిరి. అది యెట్లుముగియునో, యెవరికి జయముకలుగునో చూచుట కత్యంతయుత్సాహకరముగానుండెను. అయినను యేపక్షమువారు గెల్చినగాని, నాకుమరణముతప్పదు గావున నిదియే మంచివేళ యని చల్లగాతప్పించుకపోతిని.

మిక్కిలి భయముతో నొకగంటసేపు తిరుగగా నొక బయలుకనబడెను. అచ్చట కొందరు పచ్చిక తీయుచుండిరి. నేను ప్రశ్నింపగా వారు నేను జేరవలసినదండునకు చెందిన గడ్డితీయువారని తెలిసికొంటి. కంటూన్మెంట్ (Cantonment) మిక్కిలి సమీపముగా నున్నదని చెప్పి, మరింత దగ్గరగానుండు యడ్డదారిని వారు నాకు చూపిరి.

నేను వెళ్ళుచుంటిని. నాపటాలమునకు చెందిన ఆఫీసరులు (Officers) పరేడు (Parade) నుండి తిరిగివచ్చుచుండిరి. వారిని కలిసికొని నేనెవరనో చెప్పుకొంటిని.

“నీ గుర్రమెక్కడ?” యని యడ్జుటండు (adjutant) గారడిగిరి.

“నేను తీసుకరాలే”దని జవాబు చెప్పితిని.

"అద్భుతంటుగారికి నీవు వ్రాసిన జాబులో నీవు Z నుండి నిన్నటిదినమున బయలుదేరుదునని తెలిపి యుంటివికదా? అయితే, బోలాంగ్! నీవతిత్వరితముగా వచ్చినట్లు కనబడుచున్నదే?" యని తారుమారులుగా చిరిగిన వాదుస్తులనుచూచుచు కర్నల్ గారడిగిరి.

"అయ్యా! నిన్నటిదినమే నేను Z విడచివచ్చినాను" అంటిని.

"ఎట్లు ప్రయాణము చేసితివి?" అనిరి.

"మొదటి పాతిక మైళ్ళు గుఱ్ఱముమీద."

"ఆటుతరువాత, పల్లకీమీద కాబోలు?" అనిరి.

"అబ్బే, లేదండి" యని యుత్తరమిచ్చితిని.

"నాటుబండిమీదనా?" యని ప్రశ్నించిరి.

"అదికూడ కాదు" అని చెప్పితిని.

"మరెట్లు వచ్చితివి, చెప్పవయ్యా?" యని యడిగిరి.

ప్రపంచమున నెట్టి శూరుడైనను తలబెట్టజాలని పరాక్రమకృత్యము, నేనొనర్చియుండినను మిక్కిలి దైన్యతవహించి, భయభక్తులతో నిట్లంటిని.

"మిగిలిన డెబ్బదిమైళ్లు సుమారు, పెద్దపులిమీదవస్తిని."

"పులిమీదనా? పులిమీదనే!" యని యందరు నొక్కమారుగా నరచి గట్టిగా నవ్వసాగిరి. జరిగిన విషయములు విశదముగా చెప్పినను వారు నమ్మకపోయిరి." —అనువాదము.

దైవమా! యాడుపుట్టుక దేలనో?

శ్రీమతి ఎ. హేమలతగారు

ఆనందరాశినై అందంపుబొమ్మనై
పంజరపుచిలుకేగదా
దైవమా! యాడుపుట్టుక దేలనో?

వివిధవిద్యారతి వెలసియుండినగాని
పురుషసేవకురాలెగా
దైవమా! యాడుపుట్టుక దేలనో?

రాజ్యాంగతంత్రాళి రాణించుమణియయ్యు
మూలకృంగగ నయ్యెగా
దైవమా! యాడుపుట్టుక దేలనో?

కాళీస్వరూపిణియై కలకలంబులనొప్పి
కాళ్లులేనిదయ్యెగా
దైవమా! యాడుపుట్టుక దేలనో?

సత్యము

శ్రీమతి చర్ల సుశీలగారు

సత్యరతుఁడు హరిశ్చంద్రునకెంతయు నిర్మలకీర్తినినిలిపినావు
పితృసత్యవాగ్రక్షఁబెంపొందురాముని నవతారముగఁజేసియలరినావు
పలికినట్లుగఁజేసిబాధలందినపాండవులకు జయంబుపెంపునిడినావు
అధ్వాన్నపడవిలో నావును వ్యాఘ్రముముఖంబునఁబడకుండగాచినావు
స్వచ్ఛమౌ నీస్వరూపంబునరయ కజ్ఞ విజ్ఞులగువారలెప్పుడువిశ్వసించి
లాడితప్పుచు ధనములనందుచుంద్రు శాశ్వతానందకీర్తులుసతముగొంద్రు.